క్లుప్తంగా

మున్సిపల్ కమిషనర్‌గా నూరుల్ నదీం



అమరచింత: స్థానిక మున్సిపల్ కమిషనర్‌గా నూరుల్ నదీం బుధవారం బాధ్యతలు స్వీకరించారు. భూత్పూర్ మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న ఈయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈమేరకు కమిషనర్ మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి ప్రజలతో పాటు ప్రజాప్రతినిధులు, పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. సమష్టి సహకారంతోనే పట్టణాన్ని మరింతగా అభివృద్ధి చేసుకునే అవకాశం ఉందన్నారు. కమిషనర్‌కు చైర్‌పర్సన్ మంగమ్మ, వైస్ చైర్మన్ గోపిలు శాలువాతో సత్కరించారు.

విటమిన్-ఏ ద్రావణం పంపిణీ

పాన్‌గల్: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు విటమిన్-ఏ ద్రావణం పంపిణీ కార్యక్రమం కొనసాగుతుంది. రెండవ రోజు బుధవారం మండలంలోని శాగాపూర్ అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు వైద్య సిబ్బంది తాగించారు.

ఎస్‌ఐని సన్మానించిన నాయకులు

చిన్నంబావి: ఎస్‌ఐగా పదవి బాధ్యతలు చేపట్టిన రమేష్‌ను మండల కాంగ్రెస్ సన్మానించారు. ఈ సందర్భంగా మండలంలోని పలు సమస్యలపై నివేదించారు. కార్యక్రమంలో సురేందర్‌సింగ్, కర్ణాకర్, బొల్లు శ్రీను, రమేష్, రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

చిన్నంబావి: మండలంలోని పెద్దదగడలో చంద్రమ్మ ప్రమాదవశాత్తు కాలు తీసివేయడంతో ఆమెను బీఆర్ఎస్ నాయుడు రంగినేని అభిలాష్‌రావు పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

పెబ్బేరు రూరల్: మండలంలోని శాఖాపూర్.వై చెందిన సాయికుమార్ రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు కావడంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి బుధవారం ఆస్పత్రిలో బాధితుడిని పరామర్శించారు.

బస్సులు నడపండి

వీపనగండ్ల: మండలంలోని గోవర్ధనగిరి, గోపాల్‌దిన్నెకు డబుల్ బీటీ రోడ్డు పూర్తయినా బస్సులు నడపడం లేదని సీపీఎం మండల కార్యదర్శి బాల్‌రెడ్డి, మహబూబ్‌పాషా, ఖాజా, నర్సింహ, శేఖర్‌రెడ్డి బుధవారం తెలిపారు. వెంటనే ఇరుగ్రామాలకు అనువుగా ఉండే బస్సును ఆర్టీసీ అధికారులు నడపాలని వారు కోరారు.

ఆర్థికసాయం అందజేత

ఖిల్లాఘనపురం: మండల కేంద్రానికి చెందిన గోనెల శరవంద అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి రూ.5 వేల ఆర్థికసాయం పంపగా కాంగ్రెస్ నాయకులు రమేష్, నరేందర్‌గౌడ్, ప్రకాష్ బుధవారం పరామర్శించి అందించారు.

మానసిక సమస్యలపై అవగాహన పెంచుకోవాలి

గోపాల్‌పేట: విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి, సమస్యల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బుధవారం మండలంలోని బుద్దారం గురుకుల పాఠశాలలో మహబూబ్‌నగర్ ఈస్ట్ ఆర్‌సీఓ విద్యాలత ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి నాగర్‌కర్నూల్ జిల్లా గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఒకరోజు శిక్షణ ఇచ్చారు. హైదరాబాద్‌లో శిక్షణ పొందిన పొందిన ఆవుల సైదులు, సామల దయాకర్, ద్రోణాచారి, సునాసిలి, విజయ్ వీరికి శిక్షణ ఇచ్చారు. అనంతరం గోపాల్‌పేట ఎస్‌ఐ హరిప్రసాద్ ఉపాధ్యాయులు, విద్యార్థులకు పోక్సో, మహిళా చట్టాలు, హక్కులపై వివరించారు. మహిళలను, విద్యార్థులను ఎవరైనా వేధిస్తే నిర్భయంగా 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తే తక్షణమే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఘనంగా రోడ్డు భద్రత మాసోత్సవాలు



కొల్లాపూర్: పట్టణంలోని ఆర్టీసీ డిపోలో బుధవారం జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు డీఎం ఉమాశంకర్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎస్‌ఐ హృషికేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జనవరి నెలలో విధుల నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఆర్టీసీ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. అదేవిధంగా 24 సంవత్సరాలుగా ఒక్క ప్రమాదం కూడా చేయని డ్రైవర్ కే.రామకృష్ణను సత్కరించారు. అనంతరం ఎస్‌ఐ మాట్లాడుతూ డ్రైవర్లు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. డ్రైవింగ్ సమయంలో వాహనదారులు అందరూ తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎఫ్ యాదయ్య, డీటీఐ గోవర్ధన్, సూపరిండెంట్ నజీర్‌తో పాటు ఆర్టీసీ ఉద్యోగులు ఉన్నారు.

చదువుకు తప్పని ఆటంకాలు

- రైతువేదికలో తరగతుల నిర్వహణ
- మధ్యాహ్న భోజనం 2కి.మీ.దూరంలో
- భవనం కూల్చడంతో రెండేళ్లుగా ఇదే పరిస్థితి



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న రైతువేదిక



నిలిచిపోయిన పాఠశాల భవన పనులు

గోపాల్‌పేట: పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో కొత్త పాఠశాల భవనం నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. ఏమైందో తెలియదు పాఠశాల పనులు పిల్లర్ల వరకు చేపట్టి వదిలేశారు. మండలంలోని మున్ననూరు ప్రాథమికోన్నత పాఠశాలలో 102 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఏడుగురు ఉపాధ్యాయులు వీరికి పాఠాలు బోధిస్తున్నారు. పాఠశాల రెండేళ్ల క్రితం శిథిలావస్థకు చేరుకోవడంతో రూ.26 లక్షలతో కొత్త భవనం నిర్మించాలని అనుకున్నారు. పాత భవనం కూల్చిన తర్వాత సుమారు రూ.15 లక్షలు వెచ్చి గ్రామంలోని రైతువేదిక సమీపంలో పిల్లర్ల వరకు పాఠశాల భవనాన్ని నిర్మించారు. చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో ఎనిమిది నెలలుగా పనులు నిలిచిపోయాయి. విద్యార్థులు చదువుకునేందుకు ఎక్కడా భవనం లేక ఐదు, ఆరు, ఏడో తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయులు రైతువేదికలోనే చదువు చెబుతున్నారు. మధ్యాహ్న భోజనం చేసేందుకు మాత్రం విద్యార్థులు పాత పాఠశాల భవనం సుమారు 2కిలోమీటర్లు నడిచి వెళ్లి భోజనం చేసి తిరిగి రావాల్సిన పరిస్థితి నెలకొంది. ఒక్కోసారి మధ్యాహ్న సమయంలో విద్యార్థులు భోజనానికి వెళ్లిన సమయంలో రైతువేదికలో ఒకే ఉపాధ్యాయురాలు ఉండాల్సి వస్తుందని, చుట్టుపక్కల అటవీ ప్రాంతం ఉండటంతో ఆకతాయిలు ఎప్పుడు ఏ ఇబ్బందులకు గురిచేస్తారోనని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పాఠశాల భవనం నిర్మించాలని విద్యార్థుల తల్లితండ్రులు కోరుతున్నారు.

చాలా ఇబ్బందిగా ఉంది



మాకు ఉన్న పాఠశాలను తొలగించారు. ఇక్కడ రైతువేదికలో పాఠాలు చెబుతున్నారు. ఇక్కడ ఎటువంటి సౌకర్యాలు, మూత్రశాలలు లేవు. దీంతో మేము బయటికి వెళ్లాల్సి వస్తుంది. బయట మొత్తం అడవిలాగ ఉంటుంది. తొందరగా పాఠశాల పూర్తిచేసి సౌకర్యాలు కల్పించాలి. –షర్మిల, 7వ తరగతి విద్యార్థిని

ప్రజాప్రతినిధులు సహకరించాలి

మున్ననూరులోని ప్రాథమికోన్నత పాఠశాల రైతువేదికలో నడుస్తుంది వాస్తవమే. విద్యార్థుల కోసం పాఠశాల చాలా బాగా నిర్మించాలని అనుకున్నారు. నిధులు విడుదల కాకపోవడంతో పనులు నిలిచిపోయాయి. ప్రజాప్రతినిధులు పాఠశాల భవనం పూర్తయ్యేందుకు సహకరిస్తే బాగుంటుంది. – శ్రీనివాస్‌గౌడ్, ఎంఈఓ, గోపాల్‌పేట

సంజీవయ్యకు ఘన నివాళి



సంజీవయ్యకు నివాళులర్పిస్తున్న నాయకులు

వనపర్తిటౌన్: ఏ పదవిలో ఉన్న ప్రజా సంక్షేమానికి పాటుపడిన దామోదరం సంజీవయ్య రాజకీయాలు నేటి నాయకులు, యువతరం స్ఫూర్తిగా తీసుకోవాలని ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాష్ అన్నారు. టీజేఏసీ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో దామోదరం సంజీవయ్య 103వ జయంతిని నిర్వహించారు. ఈ మేరకు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి దామోదరం సంజీవయ్య ఎనలేని సేవలు చేశారని గుర్తుచేశారు. నెహ్రూ, ఇందిరాగాంధీ హయంలో కేంద్రమంత్రిగా, రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రజలకు సుపరిపాలన అందించిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో బురోజు గిరిరాజాచారి, నర్సింహాశర్మ, బాలస్వామినాయుడు, దేవన్న నాయుడు, బాలేమియా, పరమేశ్వరచారి, సత్యంచారి తదితరులు పాల్గొన్నారు.

స్థలం లేకుండానే శ్మశానవాటిక ఏర్పాటు



భూత్పూర్ శివారులో ఏర్పాటు చేసిన శ్మశానవాటిక

కొత్తకోట రూరల్: మండలంలోని భూత్కూర్ శివారులో ప్రభుత్వం ఏర్పాటు చేసిన శ్మశాన వాటిక నిరుపయోగంగా మారింది. ఇందుకు ప్రధాన కారణం అంత్యక్రియలు చేసేందుకు శ్మశానవాటిక సమీపంలో స్థలం లేకపోవడమే. స్థల పరిశీలన చేసేటప్పుడు సంబంధిత అధికారులు ప్రజలకు ఉపయోగపడేవిధంగా ఉందా? లేదా అని చేస్తే బాగుంటుందని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. శ్మశానవాటికలో పనులు పూర్తి కాకపోవడంతో పాటు నిర్మించనప్పటి నుంచి ఇప్పటి వరకు గ్రామస్తులు దీన్ని ఉపయోగించుకోలేదని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు శ్మశానవాటికకు సమీపంలో స్థలాన్ని సేకరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మతతత్వ విధానాలను ప్రతిఘటిద్దాం



మాట్లాడుతున్న నాయకులు

పెబ్బేరు రూరల్: కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ మతతత్వ విధానాలను ప్రతిఘటిద్దామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు పిలుపునిచ్చారు. ఆయన వనపర్తి జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలపై ఈ నెల 16న దేశవ్యాప్త కార్మికుల సమ్మె-గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చి పదేళ్లు పూర్తయినా రైతాంగ, కార్మిక వర్గ ప్రజల సమస్యలను పరిష్కరించలేదన్నారు. ఆత్మనిర్భర్ భారత్, మేకిన్ ఇండియా వంటి మోసపూరిత నినాదాలు ఇచ్చినా ఏమి ఒరగలేదన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీలు ఇచ్చి, నేడు ఉద్యోగ కల్పన పోయిందన్నారు. కార్యక్రమంలో రాజు, రమేష్, మద్దిలేటి, వెంకటేష్ పాల్గొన్నారు.

రైతులపై దమనకాండను వ్యతిరేకించండి



మాట్లాడుతున్న కార్మిక, వ్యవసాయ సంఘం నాయకులు

అమరచింత: ఢిల్లీలో రైతులపై బీజేపీ ప్రభుత్వం చేస్తున్న దమన కాండను ప్రతి ఒక్కరూ ఖండించాలని రైతు వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఢిల్లీలో రైతులపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకిస్తూ బుధవారం ఆయా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ రైతులు తమ సమస్యల పరిష్కారం కోసం కృషి చేసిన స్వామినాథన్ సిఫార్సులను పక్కకు పెట్టి బీజేపీ ప్రభుత్వం స్వామినాథన్‌కు మాత్రం భారతరత్న అవార్డు ప్రకటించి చేతులు వదిలేసిందన్నారు. కరోనా కష్టకాలంలో ఢిల్లీలో రైతులు చేసిన సుదీర్ఘ పోరాటానికి కేంద్ర ప్రభుత్వం రైతుల హామీలను నెరవేరుస్తామని రాతపూర్వకంగా పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన హామీని తుంగలో తొక్కారని విమర్శలు చేశారు. రైతులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలన్నారు. కార్యక్రమంలో జీఎస్ గోపి, వెంకటేష్, అజయ్, ఆర్ఎస్.రమేష్, రాఘవేంద్ర, అరుణ్ పలువురు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె నోటీస్



మదనాపురంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీపీఎం నాయకులు

ఆత్మకూర్: దేశవ్యాప్తంగా 16న చేపట్టనున్న కార్మికుల సమ్మె, గ్రామీణ బంద్‌లో భాగంగా మున్సిపల్ కార్మికులు బుధవారం కమిషనర్‌కు సమ్మె నోటీస్ అందజేశారు. ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి రాజు మాట్లాడుతూ.. దేశంలో వివిధ పరిశ్రమలపై కోట్లాది మంది కార్మికులు ఆధారపడి జీవిస్తున్నారని, పరిశ్రమలను నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందన్నారు. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, కూలీలు, రైతుల ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా సమ్మెలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఇస్మాయిల్, ఆశన్న, సతీష్, తులసీరాం, వెంకటన్న, చంద్రబాబు, జగదీష్, బాలకృష్ణ, నర్సింహ పాల్గొన్నారు.

కరపత్రాల పంపిణీ

మదనాపురం: కేంద్రంలో బీజేపీ కార్పొరేట్ మతతత్వ విధానాలను ధిక్కరిస్తూ ప్రతిఘటనకు పూనుకోవాలని కార్మిక సంఘం నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచుతూ 16న దేశవ్యాప్త కార్మిక సమ్మెను విజయవంతం చేయాలనీ సీపీఎం నాయకులు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెంకటరాములు, వెంకటేష్, ప్రసాద్, చిరంజీవి, మొగిలి తదితరులు పాల్గొన్నారు.

వీరజవాన్ల త్యాగాలు మరువలేనివి



ఖిల్లాఘనపురం నివాళి అర్పిస్తున్న గ్రామస్తులు

ఖిల్లాఘనపురం: పుల్వామా దాడిలో వీరమరణం పొందిన జవాన్లకు మండల కేంద్రంలో బుధవారం ఘనంగా నివాళి అర్పించారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన వీర జవాన్ల త్యాగాలు ఎప్పటికి మరవలేమన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సామ్యానాయక్, గోపి రాజు, నరేష్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రక్షణకంచె ఏర్పాటు చేయండి



ప్రమాదభరితంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

వీపనగండ్ల: మండలంలోని కల్వరాల్ల ప్రధానరోడ్డు దేవాలయానికి సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేసి వాటికి రక్షణ కంచె లేకపోవడంతో ప్రమాదం పొంచి ఉందని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి కావడంతో రద్దీగా ఉండే ఈ రోడ్డుకు అతి సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లకు అధికారులు స్పందించి రక్షణ కంచే ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు

వనపర్తిటౌన్: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో జాగృతి కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. స్నేహిత 89.08, అనన్య 84.37, శ్వేత 83.56, కావ్య 80.37 శాతం, 15 మంది విద్యార్థులు ఐఐటీ అడ్వాన్స్‌కు అర్హత సాధించినట్లు ప్రిన్సిపాల్ అంబటి వినోద్ కుమార్ బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని జీవితంలో ఎదగాలన్నారు. అనంతరం విద్యార్థులను శాలువాతో సన్మానించి, అభినందించారు. కార్యక్రమంలో శ్యాంకుమార్, సత్యనారాయణ, భాస్కర్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

అక్షరం జీవితాన్ని వెలిగిస్తుంది



కనిమెట్టలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

కొత్తకోట రూరల్: అక్షర జ్ఞానం అజ్ఞానాన్ని తొలగించి, జీవితంలో వెలుగులు నింపుతుందని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారిణి బేబి రాణి అన్నారు. మోజర్ల ఉద్యానవన కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ యూనిట్-1 క్యాంపు కార్యక్రమంలో భాగంగా మండలంలోని కనిమెట్టలో మూడు రోజులుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బుధవారం చదువు ప్రాముఖ్యతను వివరిస్తూ గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ చేపట్టారు. చదువు యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ బాల కార్మికులను, బాల్య వివాహాలను అరికట్టాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. వివిధ కారణాలతో బడి మానేసిన చిన్నారులను తిరిగి పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు.

పెద్దమందడి మండలం వెల్టూర్‌లో..

పెద్దమందడి మండలం వెల్టూర్‌లో మోజర్ల ఉద్యానవన కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ యూనిట్-2 క్యాంపు కార్యక్రమంలో భాగంగా స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార లోపం వల్ల కలిగే సమస్యల గురించి వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీరాంరెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ విద్య మాట్లాడుతూ పోషకాహారం లోపం ఉన్న పిల్లలు అనారోగ్య సమస్యలతో ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని, పెరుగుతున్న పిల్లల్లో ఫలితాలు తీవ్రంగా ఉంటాయన్నారు. తగినంత కార్బోహైడ్రేట్లు, కొవ్వులు నిల్వ ఉండవని, కొద్ది రోజుల్లోనే ఈ నిల్వలు కరిగిపోయి పిల్లలు తమ శరీర ద్రవ్య పదార్థాన్ని కోల్పోతారన్నారు. దీని వలన వ్యాధి నిరోధక శక్తి తగ్గి అనారోగ్యానికి గురవుతారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను పోషకాహార లోపం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ఘనంగా అబ్దుల్ రహీం గంధోత్సవం



గంధం తీసుకెళ్తున్న భక్తులు

మదనాపురం: మండలంలోని దుప్పల్లిలో అబ్దుల్ రహీం ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలకు కర్ణాటక, ఒడిశా, మహారాష్ట్ర ఇతర ప్రాంతాల నుంచి భక్తులు హాజరయ్యారు. బుధవారం రాత్రి గంధోత్సవం కనుల పండువగా సాగింది. దర్గా షరీఫ్ నుంచి గంధాన్ని తీసుకుని మహబూబ్‌సుబాని దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసి సమర్పించారు. అబ్దుల్ రహీం దర్గాలో పూలు, గలీఫాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్నదానం, తాగునీటి వసతి, విడిది సత్రాలు ఏర్పాటు చేశారు.

సామూహిక అక్షరాభ్యాసం



అమరచింతలో సామూహిక అక్షర భ్యాసంలో చిన్నారులు

ఆత్మకూర్: వసంత పంచమిని పురస్కరంచుకుని శ్రీసరస్వతి శిశుమందిరంలో సాముహిక అక్షరాభ్యాసం, గాయత్రి హోమం బుధవారం నిర్వహించారు. వాసవీక్లబ్, వనితాక్లబ్ ఆధ్వర్యంలో అక్షరభ్యాసంలో పలుకలు, నోట్‌బుక్కులు, పెన్నులను అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

పాన్‌గల్: మండల కేంద్రంలో వసంత పంచమి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న సర్వసతి విగ్రహానికి పాఠశాల పూర్వ విద్యార్థులు పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. అనంతరం చిన్నారులకు అక్షరభ్యాసం చేయించారు.

అమరచింత: మండల కేంద్రంలోని శ్రీ సరస్వతి శిశుమందిరంలో బుధవారం వసంత పంచమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా యాగం, చిన్నారులకు సామూహిక అక్షర భ్యాసం నిర్వహించారు. పాఠశాల కార్యదర్శి విజయ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వసంత పంచమి నాడు సరస్వతి దేవిని స్తూతిస్తు చిన్నారులకు అక్షరాలు నేర్పడం ద్వారా భవిష్యత్‌లో మంచి చదువులతో పాటు సమాజం మెచ్చుకునే పౌరులుగా ఎదుగుతారన్నారు.



పాన్‌గల్‌లో సరస్వతి పూజలో పూర్వ విద్యార్థులు

తాగి వాహనాలు నడిపితే చర్యలు



బ్రీత్ అనలైజర్‌తో పరీక్షిస్తున్న ఎస్‌ఐ శివకుమార్

కొత్తకోట రూరల్: వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని పెద్దమందడి ఎస్‌ఐ శివకుమార్ హెచ్చరించారు. వాహనాల తనిఖీల్లో భాగంగా బుధవారం రాత్రి మోజర్ల స్టేజీ సమీపంలో జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనదారుల నుంచి వాహనానికి సంబంధించిన పత్రాలను తనిఖీ చేసి, హెల్మెట్ లేని వారికి జరిమానా విధించడంతో పాటు ద్విచక్ర వాహనదారులకు బ్రీత్ అనలైజర్‌తో పరీక్షించారు. తాగి వాహనాలు నడిపితే ప్రమాదాలు చోటు చేసుకుని ప్రాణాలు పోగొట్టుకున్న కుటుంబాలు చిన్నాభిన్నంగా మారాయని, వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు రోడ్డు నిబంధనలు తప్పకుండా పాటించాలని సూచించారు.

ఎల్లమ్మ తల్లి.. కరుణించమ్మ

ఖానాపూర్‌లో 9ఏళ్ల తర్వాత రేణుక ఎల్లమ్మ దేవర్లు



బండారు చల్లుకుంటున్న భక్తులు

ఆత్మకూర్: ఎల్లమ్మ తల్లి కరుణించమ్మా అంటూ రేణుక ఎల్లమ్మ దేవర్లను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్‌లో 9ఏళ్ల తర్వాత రేణుక ఎల్లమ్మ దేవర్లను వేలాది మంది భక్తుల మధ్య గొల్ల, కురుమలు ఘనంగా చేపట్టారు. ఉత్సవాల్లో భాగంగా కుర్వడప్పులతో భారీ ర్యాలీ తీశారు. గ్రామంలోని ఆలయం వద్ద పటం ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బండారు (పసుపు) ఒకరిపై ఒకరు చల్లుకున్నారు. కార్యక్రమంలో సరళ, రాములు, మల్లేష్, బాలస్వామి, కుర్వరవి, ఈదన్న, సహదేవుడు, లింగన్న, శ్రీను, నారాయణ, శివన్న, బుచ్చప్ప భక్తులు పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్‌కు దరఖాస్తు చేసుకోండి

ఖిల్లాఘనపురం: ప్రభుత్వం 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించే పథకం కోసం వివరాలు అందించాలని ట్రాన్స్‌కో ఏఈ కొండయ్య బుధవారం ప్రకటనలో తెలిపారు. వివరాలు ఇచ్చేందుకు గురువారం చివరి రోజుని రేషన్ కార్డు, ఆధార్, ఫోన్ నంబర్, ప్రజాపాలనలో ఇచ్చిన రశీదు నంబర్‌లను గ్రామాలకు వచ్చే విద్యుత్ శాఖ అధికారులకు ఇవ్వాలని సూచించారు.